సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 3 । జనవరి । 2023



టమాట కిలో రూ.13.50

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.13.50, కనిష్ట ధర రూ.5.50 పలికింది.



వ్యవసాయ డివిజన్ల విస్తరణ

పాలనా సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలుగా వ్యవసాయశాఖ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి. 8లో

గరిష్టం/కనిష్టం
31.9°/14.1°

జిల్లాలో సోమవారం చలి తీవ్రత స్వల్పంగా పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

మహిళా సాధికారతకు ఆర్డీటీ తోడ్పాటు



శిక్షణ పూర్తి చేసిన మహిళలతో డైరెక్టర్లు విశాల ఫెర్రర్, మల్లారెడ్డి, దోరిస్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: మహిళా సాధికారతకు ఆర్డీటీ తోడ్పాటునందిస్తుందని ఆ సంస్థ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ తెలిపారు. నగర శివారులోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఆటో డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మల్లారెడ్డి, డోరిస్‌రెడ్డితో కలిసి విశాలఫెర్రర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ అడహక్ కమిటీ నియామకం

పుట్టపర్తి టౌన్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జిల్లా అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడి హోదాలో కలెక్టర్ బసంత్‌కుమార్ సోమవారం కమిటీ ఏర్పాటు చేశారు. సొసైటీ జిల్లా చైర్మన్‌గా జి.ఎం శేఖర్, వైస్ చైర్మన్‌గా పోల లక్ష్మయ్య, కార్యదర్శి, కోశాధికారిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌ను నియమించారు. అలాగే సభ్యులుగా తల్లపల్లి బయపరెడ్డి, వెంకటరమణ, రాజా, సాయిదర్శిని, ఫణిశంకర రావు, రఘునాథరెడ్డి, నాగరాజు, ఆదినారాయణలను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక అనంత క్రీడాగ్రామంతో పాటు నీలం సంజీవరెడ్డి స్టేడియంలో రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాలకు చెందిన 9 జట్లు పాల్గొన్నాయి. అనంత క్రీడాగ్రామంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్డీటీ డైరెక్టర్ దశరథ్, రాష్ట్ర అంధుల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి జలంధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సర్ లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏటా రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపిక కావడం హర్షణీయమని డీఈఓ మీనాక్షి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని డీఈఓ మీనాక్షి, పాఠశాల హెచ్ఎం శైలజ, పీడీలు అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా ప్రొద్దుటూరులో గతనెల 29 నుంచి 31 వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థి చిరంజీవి అండర్-14 బాలుర విభాగంలో బాల్‌బాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. త్వరలో జరిగే జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్ క్రీడల్లో విద్యార్థి చిరంజీవి పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని పీడీలు నవీన్‌కుమార్, నాగేంద్రలు ఆకాంక్షించారు.

'ముక్కోటి' మొక్కులు

- జిల్లా వ్యాప్తంగా కిటకిటలాడిన దేవాలయాలు
- సోమవారం తెల్లవారుజామునుంచే ఉత్తర ద్వార దర్శనం
- ఖాద్రీశుని దర్శనం కోసం పోటెత్తిన భక్తులు
- లక్ష మందికిపైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు అంచనా



కదిరి: ఖాద్రీశుని దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు



శ్రీవారి పల్లకీ మోస్తున్న కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని ఆలయాలన్నీ కిటకిటలాడాయి. వైష్ణవాలయాలు గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆలయాల ఎదుట బారులు తీరిన భక్తులు ఉత్తర ద్వార గుండా వెళ్లి స్వామివారి దర్శనంతో పులకించిపోయారు. కదిరి లక్ష్మీనరసింహుడి ఆలయంలో పాటు ధర్మవరంలోని లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయం, హిందూపురం మెయిన్ బజార్‌లోని పేట వెంకటరమణ స్వామి ఆలయం, మడకశిర కోట లక్ష్మీవేంకటరమణస్వామి, కన్యకా పరపరమేశ్వరి, పుట్టపర్తిలోని కన్యకా పరమేశ్వరీ ఆలయం, వేణు గోపాలస్వామి ఆలయాల్లో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. కొత్తచెరువు శ్రీలక్ష్మి చెన్నకేశవుని కల్యాణోత్సవం అశేష భక్తజనం నడుమ కమనీయంగా జరిగింది. సాయంత్రం ఆలయాల్లో పూజలు నిర్వహించి మేళతాళాలతో పల్లకీలో ప్రాకారోత్సవాలు నిర్వహించారు.

ఖాద్రీశా నమోనమః..

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆదివారం రాత్రే ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు స్వామి వారిని విశేషంగా అలంకరించి వైకుంఠ ఏకాదశి ఘడియలు ప్రవేశించగానే వేకువజామున 3 గంటల ప్రాంతంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారసింహుడిని ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే పెద్ద సంఖ్యలో క్యూలో ఉన్న భక్తులు ఖాద్రీశా.. గోవింద అంటూ బ్రహ్మాండనాయకుడిని కీర్తించారు. ప్రత్యేక పూజల అనంతరం తెల్లవారుజాము 3.20 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ శ్రీవారు భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలు, పండ్లతో ఆలయంలో చేసిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

శ్రీవారి పల్లకీ సేవలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి..

కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి తెల్లవారుజాము 2.40 గంటలకే ఆలయం చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనే స్వయంగా శ్రీవారి పల్లకీని మోసుకుంటూ ఉత్తర రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆ దేవ దేవుడు ఖాద్రీశుని మొక్కుకున్నట్లు తెలిపారు.

తిరువీధులు కిటకిట..

ఖాద్రీశుడి ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఖాద్రీ ఆలయం కిటకిటలాడింది. సర్వ దర్శనం క్యూతో పోలిస్తే, రూ.30 టికెట్ క్యూలోనే భక్తుల రద్దీ ఎక్కువగా కన్పించింది. లక్ష మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్ అంచనా వేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లారెడ్డి తన చెల్లెలు పార్వతమ్మ జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం చేశారు. కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ నేతృత్వంలో పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు ఆధ్వర్యంలో పోలీస్‌శాఖ గట్టి బందోబస్త్ ఏర్పాటు చేసింది.



బుక్కపట్నం: లక్ష్మీనారాయణ స్వామి సేవలో కలెక్టర్ బసంత్‌కుమార్



హిందూపురం: పేట వేంకటరమణస్వామి ఆలయం వద్ద భక్తుల బారులు



మడకశిర: కన్యకాపరమేశ్వరి ఆలయంలో విష్ణు సహస్రనామార్చన

2.42 లక్షల మందికి
పింఛన్ల పంపిణీ



అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెనుకొండ మండలం మునిమడుగుకు చెందిన సంజీవన్నకు పింఛన్ మొత్తం అందిస్తున్న వలంటీర్ సింధు

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. సోమవారం నాటికి జిల్లాలోని 2.42 లక్షల మందికి వలంటీర్లు పింఛన్లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 2,66,614 మంది పింఛన్‌దారులుండగా, వారికోసం ప్రభుత్వం రూ.73,94,43,250 మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. 1వ తేదీ తెల్లవారుజామునుంచే జిల్లాలోని 544 సచివాలయాల పరిధిలోని వలంటీర్ల ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. రెండోరోజు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న పింఛన్ లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛన్ అందజేశారు. ఫలితంగా సోమవారం నాటికి 2,42,216 మందికి లబ్ధిదారులకు (90.85 శాతం) రూ.67,14,94,500 పంపిణీ పూర్తయ్యింది. పంపిణీకి మరో మూడు రోజులు గడువు ఉన్నందున వందశాతం పూర్తి చేస్తామని పీడీ నర్సయ్య వెల్లడించారు.

పెరిగిన పింఛన్ మొత్తంతో ఆనందం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని విడతల వారీగా పెంచుతున్నారు. తాజాగా జనవరి నెలకు సంబంధించి రూ.250 పెంచి వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2,750 మేర పింఛన్ అందజేయడంతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం కనిపించింది.



బొంతలపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివానంద

గడువులోపు అర్జీలన్నీ పరిష్కరించాలి

- కలెక్టర్ బసంత్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: 'స్పందన'లో అందే అర్జీలన్నీ గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 88 అర్జీలు అందగా, ఒక్కో అర్జీదారునితో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. సమస్యను ఓపికగా విని కొన్నింటిపై వెంటనే స్పందించారు. సంబంధిత మండలాల, శాఖల అధికారులకు ఫోన్ చేసి క్షేత్ర స్థాయికి వెళ్లి గడువులోపు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. స్పందనలో అందే అర్జీల పరిష్కారంపై ప్రతి అధికారి శ్రద్ధ చూపాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారం కానిదైతే ఆ విషయాన్ని అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. చాలా సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం లభిస్తుందని, కానీ ఈ విషయం తెలియక చాలా మంది వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్నారన్నారు. దీనిపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అర్జీలు పరిష్కరించిన వెంటనే ఫొటో తీసి నవశకం పోర్టల్లో అప్లోడ్ చేయాలన్నారు. అలాచేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, స్పందన తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి చూపండి..

జిల్లాలో నిర్మిస్తున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ ఆదేశించారు. పలు మండలాల్లో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని వేగవతంతం చేయాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి..

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై గృహనిర్మాణ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీకేపల్లి, ముదిగుబ్బ, కనగానిపల్లి, తాడిమర్రి, నల్లచెరువు, కదిరి, తలుపుల, సోమందేపల్లి, పెనుకొండ మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వెనుకబడి ఉన్నారని, వెంటనే తగు చర్యలు తీసుకుని నిర్మాణాల్లో పురోగతి చూపించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని ఇలా..

- అద్దె ఇంట్లో ఉంటూ చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తనకు ఇల్లు మంజూరు చేయాలని పుట్టపర్తికి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లికి చెందిన పాతీయా కోరారు.
- రైలు ప్రమాదంలో రెండు కాళ్లూ పోగొట్టుకున్న తనకు అధికారులు రూ.3 వేల పింఛన్ ఇస్తున్నారని, ఏ ఆధారం లేని తనకు రూ.5 వేల పింఛన్ ఇప్పించాలని మడకశిర మండలం జెక్కేపల్లి గ్రామానికి చెందిన అనిల్ కోరారు.

ఆసరా.. అతివకు భరోసా



అక్కచెల్లెమ్మలకు జగన్ సర్కార్ ఆర్థిక అండ

- సంక్రాంతి కానుకగా ఆసరా మూడో విడత నిధులు!
- క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపునకు బయోమెట్రిక్
- 2019 ఏప్రిల్‌కు ముందు బ్యాంకు రుణాలు పొందిన సంఘాలకు లబ్ధి

సాక్షి, పుట్టపర్తి: అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ అండగా నిలిచారు. ఆర్థికంగా నిలదొక్కుకునేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. 'నవరత్నాలు' అమలులో భాగంగా ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు)ల్లోని అర్హులైన మహిళలకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ఆసరా పథకం ప్రవేశపెట్టారు. ఇప్పటికే రెండు విడతల సొమ్ము ఖాతాల్లో జమ చేశారు. తాజాగా మూడో విడత అమలుకు జిల్లాలో డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం అర్హులైన మహిళల నుంచి వేలిముద్రల సేకరణ చురుగ్గా జరుగుతోంది. ఇప్పటికే 98 శాతం పూర్తయింది. సంక్రాంతి కానుకగా ఈనెలలోనే లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ కానుంది.


నాలుగు విడతలుగా..

2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి ఎంత మొత్తం రుణాలు తీసుకుని ఉంటే ఈ మొత్తాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేస్తానని ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు విడతల్లో జిల్లాకు మొత్తం రూ.361.16 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ నెలలోనే మూడోవిడత అమలుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

గత ప్రభుత్వానికి భిన్నంగా..

2014 ఎన్నికల సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు... తాము అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారం దక్కిన తర్వాత దాని గురించి పట్టించుకోలేదు. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంకు రుణాలు చెల్లించక పోవడంతో పొదుపు సంఘాలన్నీ నిర్వీర్యమయ్యాయి. డిఫాల్ట్ సంఘాలుగా ముద్రపడ్డాయి. బ్యాంకర్ల ఒత్తిళ్లకు మహిళలు తీవ్ర అవస్థలు పడ్డారు. కానీ వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల చేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

సంక్రాంతి కానుక



'ఆసరా' పథకం అమలుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నిధులు దుర్వినియోగం కాకుండా లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ సేకరిస్తున్నాం. 'ఆసరా' మూడో విడత నిధుల విడుదలకు కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. సంక్రాంతి కానుకగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుంది.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

రేపటి నుంచి బాబయ్య ఉరుసు



విద్యుత్ దీపాల కాంతుల్లో బాబయ్య స్వామి దర్గా

పెనుకొండ: హిందూముస్లింల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న పెనుకొండలోని బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 4న ప్రారంభం కానున్నాయి. దర్గాలో రాత్రి బస చేస్తే రోగాలు నయమవుతాయని, ఆ కుటుంబంలో సుఖశాంతులు నెలకొని సంతోషంగా జీవిస్తారన్నది భక్తుల నమ్మకం. బాబయ్య స్వామి గొప్పతనాన్ని చాటిచెప్పేలా ఏటా ఉరుసును పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే బుధవారం గంధం వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బుధవారం రాత్రి 10 గంటలకు మొదటి గంధం వేడుకలు పీఠాధిపతి సజ్జద్‌బాబా ఆధ్వర్యంలో ప్రారంభమవుతాయి. అంతకు ముందు సర్వమత సమ్మేళనంలో వివిధ రాష్ట్రాలకు చెందిన మత పెద్దలు పాల్గొని ప్రసంగించనున్నారు. దాదాపు లక్షకు పైగా భక్తులు తరలిరానున్నట్లు అంచనా. 5వ తేదీ దీపారాధన, ఆసే తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బాబయ్య స్వామి మహాసమాధి

రాజ్యాన్ని వదిలి..

ఇరాన్‌లోని సీస్తాన్‌కు చెందిన సుల్తాన్ సయ్యద్ హుస్సేన్, సయ్యదా బాబా ఫాతిమా దంపతుల హజరత్ బాబా ఫక్రుద్దీన్ రహమతుల్లాఅలై (బాబయ్య) 12వ శతాబ్దానికి చెందిన వారు. పెనుకొండకు రాకమునుపు సీస్తాన్ రాజ్యానికి రాజుగా ఉండేవారు. రాజుగా ఉంటూ ఓ నిరుపేద కుటుంబానికి న్యాయం చేయలేదన్న ఆవేదన ఆయన్ను కలచి వేసింది. దీంతో రాజ్యాన్ని వదిలి మక్కా, మదీనా, ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్, గుజరాత్ తదితర ప్రాంతాల మీదుగా కాలినడకన తిరుచానపల్లికి చేరుకున్నారు. అక్కడే పీర్‌నాథర్ తల్లే ఆలం బాద్‌షా నతహర్ వలి వద్ద శిష్యుడిగా చేరి ఆధ్యాత్మిక చింతనలో జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే గురువు ఆదేశాల మేరకు తన నివాసాన్ని గుర్తించేందుకు కాలినడకన పెనుకొండకు చేరుకున్నారు. గురువు ఇచ్చిన మిస్వాక్ పుల్ల ఈ ప్రాంతంలో చిగురించడంతో అదే తన నివాసమని గుర్తించి ఇక్కడే ఉంటూ తన దివ్య మహిమలతో భక్తుల మదిలో అవధూతగా చెరగని ముద్ర వేసుకున్నారు. 1295, మే 5న బాబా నిర్యాణం అనంతరం ఇక్కడే మహా సమాధి నిర్మించి నిత్య ప్రార్థనలు చేస్తున్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 35 వినతులు



ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న నల్లమాడ చిట్టీ బాధితులు

పుట్టపర్తి అర్బన్‌: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 35 వినతులు అందాయి. ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్‌ను నేరుగా బాధితులు కలసి వినతి పత్రాలు అందజేసి, మాట్లాడారు.

- నల్లమాడకు చెందిన టీడీపీ కార్యకర్త వీరాంజనేయులు చిట్టీలు నిర్వహిస్తుండేవాడు. ఇటీవల చిట్టీ డబ్బులు ఇవ్వకుండా వడ్డీతో కలిపి చెల్లిస్తానంటూ నమ్మబలికి రూ. లక్షల్లో వసూలు చేసుకుని మూడు నెలల క్రితం ఉడాయించాడు. ఘటనపై మోసపోయిన తామంతా నల్లమాడ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తమకు న్యాయం చేయాలని నల్లమాడకు చెందిన పలువురు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.
- తన పెద్ద కుమారుడు నవీన్‌కుమార్‌ను చిల్లమత్తూరు మండలం మొరుంపల్లికి చెందిన మంజునాథ్, హరీష్‌ హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని బాగేపల్లి తాలూకా మిట్టేమర్రికి చెందిన అశ్వత్థప్ప స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. అవసరమైతే తన కుమారుడి మృతదేహానికి మళ్లీ పోస్టు మార్టం నిర్వహించాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య



హరీష్‌ మృతదేహం

చిలమత్తూరు: మండలంలోని మొరంపల్లి గ్రామానికి చెందిన హరీష్‌ (23) సోమవారం రాత్రి సంజీవరాయునిపల్లి సమీపంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో మరణ వాఙ్మూలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రదీప్‌ అనే వ్యక్తి పేరు ప్రస్తావన ఉంది. తన చావుకు కారణం సెల్‌ఫోన్‌లో వీడియో తీసినట్లుగా రాసి ఉంది. కాగా, గత ఆదివారం మొరసలపల్లి వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన నవీన్‌కు మార్చి హత్య అని, హరీష్, మంజునాథ్‌లే హత్య చేశారని కేసును తప్పుదారి పట్టించిన ఎస్‌ఐ శ్రీనివాసులు, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టరుపై చర్య తీసుకోవాలంటూ ఎస్పీకి మృతుడి నవీన్‌ తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హత్య ఆరోపణలు ఎదుర్కొంటున్న హరీష్‌ ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసుల ఒత్తిడి కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా వీడియోల ఉందన్న ప్రచారం ఊపందుకుంది.

కల్యాణం... కమనీయం





కొత్తచెరువులో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు, వైకుంఠ ద్వారా దర్శనానికి బారులు తీరిన భక్తులు, భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కొత్తచెరువు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం చెన్నకేశవపురంలో లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు ఉషారాణి, చెన్నారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఏటా ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మూడు రోజులుగా విశేష హోమాలు, ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున సాగాయి. సోమవారం ఉత్తర ద్వార గుండా శ్రీవారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి, వేద మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ధర్మకర్తలు సమర్పించారు. ఉత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో చెన్నకేశవపురం జనసంద్రమైంది. భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో కలెక్టర్‌ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్‌ సింగ్, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి, స్థానిక ప్రముఖుడు మల్లికార్జునరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

25 మందికి షోకాజ్‌

అనంతపురం క్రైం: విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరపాలక సంస్థలోని 25 మంది ఉద్యోగులకు సంస్థ అదనపు కమిషనర్‌ రమణారెడ్డి షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.10 గంటలకు నగర పాలక సంస్థలోని పలు విభాగాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో సూపరింటెండెంట్లు, సీనియర్‌ అసిస్టెంట్లు, జూనియర్‌ అసిస్టెంట్లు కన్పించకపోవడంతో హాజరు పట్టికను పరిశీలించి, 25 మందికి షోకాజ్‌ నోటీసులు జారీ చేశారు. ఇకపై బయోమెట్రిక్‌ హాజరు అమలు చేస్తామని, ప్రతి ఒక్కరూ ఫేస్‌ యాప్‌ ద్వారా హాజరు నమోదు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నోటీసులు తీసుకున్న వారిలో సూపరింటెండెంట్లు విజయ్‌కుమార్, ఖయ్యూం, దేవశంకర్, సీనియర్‌ అసిస్టెంట్లు సుగుణ, సునీల్, అరుణమ్మ, బాలాజీ, పెద్దక్క, కుళ్లాయప్ప, నారాయణస్వామి, జూనియర్‌ అసిస్టెంట్లు మహేష్, రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్లు, సావిత్రమ్మ, సందీప్‌చౌతా తదితరులు ఉన్నారు.

వ్యవసాయ డివిజన్ల విస్తరణ

- ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా పరిధిలో 11 వ్యవసాయ సబ్‌ డివిజన్లు
- తాజాగా నియోజకవర్గ కేంద్రంగా ఓ డివిజన్‌
- గుత్తి సబ్‌ డివిజన్‌ గుంతకల్లుకు మార్పు



అనంతపురం వ్యవసాయ సబ్‌ డివిజన్‌ ఏడీ కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్‌: పాలనాపరమైన సౌలభ్యం కోసం గతేడాది మార్చి 4న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ పూర్తి చేయగా... తాజాగా శాసనసభ నియోజకవర్గ కేంద్రంగా వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ కమిషనరేట్‌ నుంచి ఉత్తర్వులు అందడంతో ఆ దిశగా సన్నాహక చర్యలు మొదలయ్యాయి. జిల్లాల విభజన నేపథ్యంలో మొత్తం 63 మండలాలను 'అనంత' పరిధిలో 31, కొత్తగా శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోకి 32 మండలాలను చేర్చిన విషయం తెలిసిందే. వ్యవసాయశాఖ జాయింట్‌ డైరెక్టర్‌ (జేడీఏ) హోదాను జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ)గా మార్పు చేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 వ్యవసాయ సబ్‌డివిజన్లు..

ప్రస్తుతం అనంతపురం జిల్లా పరిధిలో అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం... ఆరు వ్యవసాయ సబ్‌డివిజన్లు ఉండగా... శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర... ఐదు సబ్‌డివిజన్లు ఉన్నాయి. మొత్తం 11 వ్యవసాయ సబ్‌డివిజన్లను అసిస్టెంట్‌ డైరెక్టర్‌ (ఏడీఏ) స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఇందులో అనంతపురం సబ్‌ డివిజన్‌ పరిధిలో ఆరు మండలాలు, గుత్తి డివిజన్‌లో ఐదు, కళ్యాణదుర్గం డివిజన్‌లో ఆరు, రాయదుర్గం డివిజన్‌లో ఐదు, తాడిపత్రి డివిజన్‌లో ఐదు, ఉరవకొండ సబ్‌ డివిజన్‌ పరిధిలో నాలుగు, ధర్మవరం సబ్‌ డివిజన్‌ కింద ఆరు, హిందూపురం డివిజన్‌లో ఐదు, కదిరి డివిజన్‌లో అత్యధికంగా 10, మడకశిర డివిజన్‌లో ఐదు, పెనుకొండ సబ్‌ డివిజన్‌ పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 11 డివిజన్లు కాస్త 14కు చేరుకోనున్నాయి.

నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు..

పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించడానికి వీలుగా ఇపుడు నియోజక వర్గ కేంద్రంగా ఓ వ్యవసాయ సబ్‌డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఒక నియోజక వర్గంలో ఉన్న ఒకట్రెండు మండలాలు మరో నియోజక వర్గ పరిధిలో ఉన్నందున కొన్ని సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఉదాహరణకు గుత్తి డివిజన్‌ పరిధిలో శింగనమల మండలం, అనంతపురం డివిజన్‌ పరిధిలోకి రాప్తాడు, కూడేరు మండలాలు, పెనుకొండ డివిజన్‌ పరిధిలోకి పుట్టపర్తి మండలం... ఇలా కొన్ని మండలాలు అటుఇటుగా ఉండడంతో ప్రోటోకాల్, ఇతర సమస్యలు తలెత్తుతున్నందున రాష్ట్ర వ్యాప్తంగా మార్పునకు శ్రీకారం చుట్టారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్తగా శింగనమల, రాప్తాడు, పుట్టపర్తి వ్యవసాయ సబ్‌ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. అలాగే గుత్తిలో ఉన్న సబ్‌డివిజన్‌ కార్యాలయాన్ని గుంతకల్లుకు మార్పు చేయనున్నారు. నియోజకవర్గ కేంద్రం శింగనమలలో కాకుండా అందరికీ అందుబాటులో ఉండేలా డివిజన్‌ కార్యాలయాన్ని నార్పలలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ఆయా నియోజక వర్గ ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

ఆర్‌బీకేల విభజన..

ఉమ్మడి జిల్లా పరిధిలో 867 రైతు భరోసా కేంద్రాలు ఉండగా ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో 451, శ్రీసత్యసాయి జిల్లాలో 416 ఆర్‌బీకేలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో అత్యధికంగా కణేకల్లు మండలంలో 21, తాడిపత్రిలో 19, కళ్యాణదుర్గం, విడపనకల్లులో 18, అనంతపురం, ఉరవకొండలో 17 చొప్పున ఆర్‌బీకేలు ఉండగా... అత్యల్పంగా ఆత్మకూరు, వజ్రకరూరులో 10 చొప్పున ఆర్‌బీకేలు పనిచేస్తున్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో అత్యధికంగా ముదిగుబ్బలో 21, మడకశిరలో 20, హిందూపురంలో 18, గోరంట్లలో 17 ఉండగా, అతి తక్కువగా గాండ్లపెంటలో 7, అమడగూరులో 9 ఆర్‌బీకేలు ఉన్నాయి.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

అనంతపురం అర్బన్‌: అన్ని శాఖల ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్‌ నాగలక్ష్మి తెలిపారు. వివిధ అంశాలపై కలెక్టర్‌ సోమవారం కలెక్టరేట్‌ నుంచి జిల్లా, డివిజన్, మండల, మునిసిపల్‌ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులందరూ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నమోదులో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పింఛను రూ.2,750కి పెంచిన క్రమంలో మంగళవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు సచివాలయాలు, ఆర్‌బీకేల వద్ద ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా అంగన్‌వాడీ సెంటర్లలో భోజనం చేసేలా ఐసీడీఎస్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్‌ సెంటర్లు, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, హౌసింగ్‌ పీడీ కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, పీఆర్‌ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ ఎహసాన్‌బాషా, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్‌ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా శాప్‌ లీగ్‌ అథ్లెట్ల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్‌: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్‌) ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన కర్నూలులో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్‌ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను సోమవారం అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో చేపట్టారు. ఎంపికలను జిల్లా చీఫ్‌ కోచ్‌ వెంకటరమణ, ఏజీఎస్‌ పాఠశాల కరస్పాండెంట్‌ సల్మాన్‌రాజ్, కోచ్‌లు మంజుల, ప్రతాప్, అనిల్‌కుమార్, సంధ్య పర్యవేక్షించారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే

విభాగం	పురుషులు	మహిళలు
100 మీటర్ల పరుగు	రవీంద్ర, షోయబ్‌ అబ్దుల్లా, ఫణీంద్ర	విజయలక్ష్మి, యశస్విని, రజని
400 మీటర్ల పరుగు	మంజునాథ్, ఫణీంద్ర, మణికంఠ	ముబీనా, పావని, అక్షయ
1500 మీటర్ల పరుగు	మహీంద్ర, భరత్‌కుమార్, రుషిల్‌	అఖిల, పావని, రేఖారెడ్డి
లాంగ్‌ జంప్‌	రవీంద్ర, గోపికృష్ణ, సంతోష్‌	బృంద, పావని, ముబీనా
షాట్‌పుట్‌	మణికంఠ, సోమనాథరెడ్డి, జయచంద్ర	అనిల, మౌన, రాజశ్రీ

తపాలా ఎస్పీగా బాలసత్యనారాయణ

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్‌ తపాలా ఇన్‌చార్జ్‌ ఎస్పీగా హిందూపురం తపాలా ఎస్పీ పీవీఎల్‌ఎన్‌ బాలసత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకూ అనంతపురం ఎస్పీగా పని చేసిన నరసప్ప విజయవాడకు బదిలీ అయ్యారు.

'హతమార్చి బావిలో పడేశారు'



న్యాయం చేయాలని కోరుతున్న చిన్న వెంకట్రాముడు బంధువులు

పుట్టపర్తి అర్బన్‌: తమ చిన్నాన యానాది చిన్న వెంకట్రాముడు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించలేదని, తోడుగా ఉన్న వారే హతమార్చి బావిలో పడేశారంటూ పుట్టపర్తి మండలం అమగొండపాళ్యానికి చెందిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు వాపోయారు. సోమవారం పుట్టపర్తికి వచ్చిన వారు ఈ మేరకు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌తో పాటు, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో వెంకట్రాముడు అన్న కుమారుడు రాజా మాట్లాడుతూ.. తమ చిన్నాన్నతో కలసి గత నెల 28న హరి, నాగభూషణ బుక్కపట్నం వెళ్లి మద్యం కొనుగోలు చేశారన్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో తాగి గొడవ పడి, చిన్న వెంకట్రాముడిని హతమార్చి బావిలో పడేశారన్నారు. ఘటనకు సంబంధించి వారిద్దరిపైనే తమకు అనుమానం ఉందన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని పోలీసులను కోరినట్లు వివరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ఉరవకొండ: విడపనకల్లు మండలం వి.కొత్తకోట గ్రామానికి చెందిన వివాహిత పద్మావతి (38) అనుమానాస్పద స్థితిలో ఆదివారం రాత్రి మృతిచెందింది. భర్త వేధింపులు తాళలేకనే ఆమె మృతి చెందినట్లు పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో బాధితులు పేర్కొన్న వివరాలు... కర్నూలు జిల్లా ఆస్పరి మండలం జొహరాపురం గ్రామానికి చెందిన లింగన్న, సుంకమ్మ దంపతుల కుమార్తె పద్మావతికి మూడేళ్ల క్రితం వి.కొత్తకోటకు చెందిన సంజీవ్‌తో వివాహమైంది. పెళ్లి జరిగినప్పటి నుంచి పద్మావతిని భర్త, అతని కుటుంబసభ్యులు తీవ్రంగా వేధించేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 1వ తేదీ రాత్రి పద్మావతిని సంజీవ కొట్టి హతమార్చడమే కాక ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించాడు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి సంజీవపై చర్యలు తీసుకోవాలని విడపనకల్లు ఇన్‌చార్జ్‌ ఎస్‌ఐ వెంకటస్వామికి మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

లైఫ్‌ సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌ ప్రక్రియ ప్రారంభం

అనంతపురం రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల లైఫ్‌ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు పెన్షనర్ల అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వెరిఫికేషన్‌కు సంబంధించి జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ప్రత్యేక కౌంటర్‌ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనరు తగిన ఆధారాలను అందజేసి, ఆన్‌లైన్‌ వెరిఫికేషన్‌ను పూర్తి చేసుకోవాలని సూచించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: ఏడు రోజుల వ్యవధిలో జిల్లా పోలీసులు 101 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. వీటిని సోమవారం సంబంధీకులకు అనంతపురం ఎస్పీ డాక్టర్‌ ఫక్కీరప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాట్‌బాట్‌ సేవలు అందుబాటులోకి తెచ్చిన తర్వాత ఇప్పటి వరకూ 4,360 సెల్‌ఫోన్లను రికవరీ చేసి, సంబంధీకులకు అందజేసినట్లు వివరించారు. వీటి విలువ దాదాపు రూ.6.97 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు, టెక్నికల్‌ విభాగం ఎస్‌ఐ సుధాకర్‌ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడీఏ అక్రమాలపై నేటి నుంచి విచారణ

కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్‌ ఫాంలో పూర్వ ఏడీఏ సనావుల్లా అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై మంగళవారం నుంచి విచారణ చేయనున్నారు. పదేళ్ల నుంచి ఇక్కడ ఫాంలో ఏడీఏగా పని చేసిన ఆయన సరైన రికార్డులు నిర్వహించకుండా ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేసినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాక ఫాం బకాయిపడిన రూ.1.18 కోట్ల సొమ్మును ప్రభుత్వం ఇటీవల వన్‌ టైమ్‌ సెటిల్‌మెంట్‌ ద్వారా 24 మందికి రూ.78.36లక్షలు చెల్లించింది. ఈ 24 మందితోనూ ఏడీఏ కుమ్మక్కై ఆ నిధుల్లో సగం డబ్బు తన ఖాతాలకు మళ్లించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ కమిషనర్‌ అక్రమాలపై విచారణ చేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఆడిట్‌ బృందాన్ని నియమించారు. చీఫ్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఐదుగురు అధికారులు అగ్రికల్చర్‌ ఫాంలో పదేళ్ల రికార్డులను పరిశీలించనున్నారు. బకాయిదారులను కూడా విచారించనున్నారు.

నలుగురు ఎస్‌ఐల బదిలీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్పీ ఫక్కీరప్ప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆత్మకూరు ఎస్‌ఐ శ్రీనివాసులును స్పెషల్‌ బ్రాంచ్‌కు, ఆయన స్థానంలో అనంతపురం త్రీటౌన్‌ ఎస్‌ఐ రంగడును నియమించారు. రాప్తాడు ఎస్‌ఐ రాఘవరెడ్డిని స్పెషల్‌ బ్రాంచ్‌కు, కనగానపల్లి ఎస్‌ఐ ఆంజనేయులును రాప్తాడుకు బదిలీ చేశారు. కనగానపల్లి ఎస్‌ఐ స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది.

'ఆరోగ్య అనంతపురం'తో సుపరిపాలన

- యాప్‌ను ప్రవేశపెట్టిన జిల్లా యంత్రాంగం
- 12 శాఖలతో రూపొందించిన యాప్‌
- ఫిర్యాదులు, సమస్యలపై ప్రతి వారం సమీక్ష

Aarogya Ananthapuramu

అనంతపురం అర్బన్‌: ప్రజలకు అవినీతి రహిత, పారదర్శక, జవాబుదారీతనంతో కూడుకున్న సుపరిపాలనను అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా 'ఆరోగ్య అనంతపురం' యాప్‌ ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ యూజర్‌ ఫ్రెండ్లీ, వేగవంతమైన యాక్సెస్, కచ్చితమైన రీతిలో అభివృద్ధి చేసినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ యాప్‌ను గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. ఇది పూర్తిగా అనంతపురం జిల్లా ప్రజలకు మాత్రమే ఉద్దేశించినది.

12 శాఖలతో యాప్‌..

జిల్లా యంత్రాంగం వ్యవసాయ, పశు సంవర్ధక, జిల్లా పౌర సరఫరాల కార్యాలయం, డీఆర్‌డీఏ, డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్, విద్య, ఆహార భద్రత, ఆరోగ్యం, ఉద్యానవన, ఐసీడీఎస్, రాష్ట్ర వాణిజ్య పన్నులు, తూనికలు కొలతలు వంటి 12 శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి 'ఆరోగ్య అనంతపురం' రూపొందించింది. ప్రజలు ఈ శాఖల నుంచి ఎదురయ్యే సమస్యలను, ఫిర్యాదులను యాప్‌ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. వీటిని ప్రతి వారం జాయింట్‌ కలెక్టర్‌ స్వయంగా సమీక్షిస్తారు.

యాప్‌ ఇలా...

యాప్‌లోకి వెళ్లి ఫిర్యాదును లేదా సమస్యను ఎలా నమోదు చేయాలనే వివరాలను అధికార యంత్రాంగం తెలియజేసింది. ప్రతి దశలోనూ నమోదిత వినియోగదారు ఫిర్యాదును ట్రాక్‌ చేయవచ్చు. ప్రతి ఫిర్యాదుకూ ప్రత్యేక ఐడీ జారీ చేస్తారు.

స్టెప్‌ 1: ఎవరైనా తమ మొబైల్‌ నంబర్, పేరు, ఇతర సాధన వివరాల ద్వారా ముందుగా యాప్‌లో నమోదు చేసుకోవాలి. ఆ తరువాత రిజిస్టర్‌ యూజర్‌ కంప్లైంట్‌ లాడ్జ్‌ చేయడానికి కొనసాగవచ్చు.

స్టెప్‌ 2: డ్రాప్‌ డౌన్‌ జాబితా నుంచి సంబంధిత విభాగాన్ని ఎంచుకోవాలి.

స్టెప్‌ 3: డ్రాప్‌ డౌన్‌ జాబితా నుంచి టైప్‌ సమస్యను ఎంచుకోవాలి.

స్టెప్‌ 4: జియో కో–ఆర్డినేట్‌ సహాయంతో ఫొటోను అప్‌లోడ్‌ చేయడం ద్వారా ఫిర్యాదును సమర్పించాలి.

స్టెప్‌ 5: ఫిర్యాదును జిల్లాస్థాయిలో సంబంధిత శాఖ పరిష్కరిస్తుంది.

స్టెప్‌ 6: ఫిర్యాదు జిల్లాస్థాయికి, క్షేత్రస్థాయి అధికారికి పంపిస్తారు.

స్టెప్‌ 7: దాఖలు చేసిన స్థాయి అధికారులు విచారణ చేసి ఫిర్యాదును పరిష్కరిస్తారు. (తీసుకున్న చర్యకు సంబంధించి నివేదిక అప్‌లోడ్‌ చేస్తారు)

సత్వర సేవలందించడమే లక్ష్యం



ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సత్వరం మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంగా ''ఆరోగ్య అనంతపురం'' యాప్‌ను తీసుకొచ్చాము. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్‌ 24న దీనిని ప్రారంభించారు. ఇది అనంతపురం జిల్లా ప్రజలకు మాత్రమే. 12 ప్రభుత్వ శాఖలను యాప్‌ పరిధిలోకి తీసుకొచ్చారు. యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుని వినియోగదారు తన సమస్య, ఫిర్యాదు నమోదు చేయాలి. దీనిని ఆయా శాఖలకు పంపి పరిష్కార చర్యలు తీసుకుంటారు. సమస్యలు, ఫిర్యాదులపై ప్రతివారం నేనే స్వయంగా సమీక్షిస్తాను.

– కేతన్‌గార్గ్, జాయింట్‌ కలెక్టర్‌